# ఎచ్చరిక

బావి దగ్గర నుండి ఎత్తుకొచ్చిన నాగలిని కొట్టంలో దించి తలపాగను సర్దుకుంటూ వస్తున్న పెంటయ్యకు ఏబదేండ్లు. మడత వేసి కట్టిన దొడ్డుధోతి మోకాలును దాటలేదు. రుమాలులో చెక్కిన మర్రాకు చుట్ట పుట్టకొక్కులా కనిపిస్తూ వుంది.

కొట్టందాటి యింటిముందున్న పందిరికింద నిలుచొన్న నర్సిరెడ్డి పటేలు పెంటయ్యనుద్దేశిస్తూ "నీ కొడుకు జీతం వుండను అన్నాడంట, నా బాకీ తీర్చి నీ ఇష్టం ఉన్నకాడికి పొంమ్రా" అంటూ తాను కప్పుకున్న దుప్పటిని మలిచి, గోడకు ఆనిచ్చి వుంచిన మంచం పట్టె మీద పెట్టాడు.

"తీర్చుకుంటే తప్పుద్దా పటేల" అంటూ సిక్క పందిరి మీది పగ్గాన్ని అందుకుని, చుట్టచుట్టి చేతపట్టుకున్నాడు.

"యిది తప్పించుకునే ఎత్తేరా" పెంటయ్య వైపు తిరుగుతూ.

"అట్ల తప్పించుకునే జల్మ కాదు. ఎవరి రుణంల ఎందుకు పడాలె? దేవుడిచ్చిన రెక్కలున్నయి. తినో తినకో, కడుపు కట్టుకొని అప్పు తీర్చుకుంట" ఏదో బాధ ముక్కుల్లో నుండి బయటికి రాగా కళ్ళల్లో నీళ్ళు తిరిగినవి.

"నీవు తీర్చేంత తీర్చితివి మిగిలింది నీనించి కాదు"

"ఆడు నేను చెప్పంగ యింటలేడాయె! పోతా, పోతా అని ఒక్కటే పాట! యిగ నేను ఏంజెయ్యాలె చెప్పుండ్రి"

"యాడికిరా పొయ్యేది! యిక్కడ చేసినా చెయ్యకున్న నడుసుద్ది. కూరుపట్ల బిడ్డా, నీడ పట్టుకాసినా దినబత్తెం ఎక్కడబోదు. వుర్కి వుర్కి పాలు తాగిందానికంటే, నిలబడి నీళ్ళు తాగింది మంచిదిర" ఎన్నికల్లో ఓటరుకు, కార్యకర్త తన అభ్యర్థి గూర్చి నచ్చచెప్పినట్టుగ నర్సిరెడ్డి పటేలు తన జీతగాడైన పెంటయ్యకు చెపుతున్నాడు.

మూడు తరాల ముందునుండె పెంటయ్య, వాళ్ళ తాత, తండ్రి నర్సిరెడ్డి పటేలు తాత, తండ్రి దగ్గర వ్యవసాయపు పనులు చేసే వాళ్ళు. పెంటయ్యగూడ తన బాల్యంనుండే మొదట పశువుల కాపరిగ వుంటూ తాను ఎదుగుతూ, పొలం పనులన్నీ నేర్చుకున్నాడు. ఆ తర్వాత యిప్పుడు మొత్తం వ్యవసాయాన్నే చేస్తూ, మిగతా తనతోటి వాళ్ళతో పనులు చేయిస్తున్నాడు. పెంటయ్య కొడుకు రాములు చిన్నప్పటి నుండి తండ్రి, తాతల్లాగే పసుల దగ్గర, ఆ తర్వాత పొలం

పనులు చేస్తూ వస్తూ ఒక్కసారే యికనేను ఈ పనులు చేయను అన్నాదు అంతే యిక పటేలుకు పట్టరానికోపం వచ్చినా, దాన్ని తమాయించుకొని తన అప్పు చెల్లించమంటున్నాదు. అయినా తాత నాదు, తండ్రినాడు లేని ఈ ధైర్యం, యింతటి ఆలోచన వీడికెట్ల వొచ్చిందా అని తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

"ఆదిగాదురా! మీ తాత, తండ్రీ దేశాలమీద పోయి బతికిండ్రా? చెప్పెంరా? సప్పుడు చెయ్యవ్?"

"నేనేమి సెప్పను పటేల. మా తాత సెప్పితే మా అయ్య యిన్నడు. మా అయ్య సెప్పితే నేవిన్న. ఈనాటి వరకు మీకాళ్ళ దగ్గరే పడున్న"

"అట్టేనె మరి వానికిగూడ జెర సెప్పర"

"సెప్పి సెప్పె ప్రాణం ముక్కులకొచ్చె, ఏమన్నంటే కయ్యన లేస్తుందె"

"సరే మీ ఇష్టం అప్పు సెల్లగట్టి పొమ్మను" అంటూ పటేలు యింట్లోకి విసురుగ పెళ్ళాడు.

పెంటయ్య అక్కడి నుండి కదిలి తన గూడెం పోతున్నాడు. మువ్వల చప్పుడుతో కచ్చడం ఎదురొచ్చి ఆగింది. కచ్చడంలో నుండి తొంగిచూస్తూ "ఏంర పెంట బాగున్నావా?" అంటూ అడిగాడు. పట్నంలో చదువుతున్న పటేలు కొడుకు శీన్‌రెడ్డి;

"అ-అ బాగానేవున్న" ఎంతో తృప్తిగ ఏదో పొందిన వాడిలా అన్నాడు పెంటయ్య. కచ్చడం కదిలింది.

తన యింటి వైపు నడుస్తున్న పెంటయ్య తలనిండా ఆలోచనలే. పోరడు ఆనాడు చెపితే వినడాయే-

మనస్సు ఒక్కసారే యిరవై ఏండ్ల ఎనకకుపోయింది. అప్పుడు తాను బలంగా బందెద్దులాగ వుండేవాడు. ఆ రోజు పటేలు ఈలాగే మాట్లాడిండు.

తన కొడుకును బడికి పంపిద్దామనుకుంటే "ఎందుకురా చదివి ఏమెలగబెడతడు? అరె ఈ భూమి, ఈ యవసాయం ఎవరికిర, చేసుకొని మంచిగ బతక్క" అన్నాడు.

పెంటయ్య దొర కళ్ళలోకి చూశాడు. అది గ్రహించిన దొర "నీవు నాకల్ల ఎందుకు చూస్తున్నావో అర్థమైందిర! నా కొడుకుని వద్దంటున్నావు. మరి నీ కొడుకును బడికెందుకు పంపుతున్నావని గదా? వానికి వాడితాత సంపాదించింది వుంది. కాబట్టి సదువుతాడు. వద్దనుకున్ననాడు వచ్చి ఇంట్లో కుకోని తింటడు. యింకా కావాలనుకుంటే ఉయాల్ల రేపు ఓటి వుంది, అందర్కి పనికొచ్చేది, అదే రాజకీయాలు. మరి నీ కొడుకు? మీకు రెక్కాడితేనే గదరా డొక్కాడేది."

పెంటయ్యకు తన పరిస్థితి ఏమిటో అర్థం అయ్యింది. ఆ రోజు అన్నం తినేటప్పుడు భార్యతో చెప్పాడు. ఆమె ఏం మాట్లాడలేదు. ఆమె తొడమీద అప్పటి ఆరేండ్ల రాములు నిద్రపోతున్నాడు వాడి చేతిలో కాల్చిన చింతపాలకాయ అలాగే వున్నది. పెంటయ్య చిప్పలోకి గంజివొంచి, ఓ పచ్చిమిరపకాయ అందించింది.

"అయ్యోల్ల అదన్న పిలగాన్ని తప్పక బడికి తోల్తాఅంటే పంపదునో ఏమో! అప్పటినుంచి సదువుకుంటే యిప్పుడు పెద్ద ఆమీన్‌సాబో, సదువు పంతులో అయ్యేటోడే"

భోజనం ముగించుకొని, పళ్ళల్లో పుల్లను గుచుకుంటూ పందిట్లో

అటు, ఇటు తిరుగుతు వీడికి ఈ బుద్ధి ఎలా పుట్టిందా అని ఆలోచిస్తున్నాడు నర్సిరెడ్డి పటేలు. తన ఏబదేండ్ల కాలంలో ఈలాంటి పరిస్థితిని ఎన్నడు చూడలేదు. మూతికి ముండ్ల గోరు కట్టినదూడ, సంకలో పచ్చిగడ్డి మోపుతో రాములు కొట్టుకొచ్చిన బర్రెను చూడగానే తోకాడిస్తూ పరిగెత్తి తన తల్లి పొదుగు దగ్గర మూతి పెట్టింది. మూతికున్న ముళ్ళు గుచ్చుకోగానే దూడను కొమ్ములతో నెట్టేసి గుంజదగ్గరికి వెళ్ళి నిలుచుంది. మోపును బర్రెగాడిలో విప్పేసి దోతికొంగులో కుక్కుకొని తెచ్చిన లేతగడ్డిపోసల్ని దూడముందేసి దాని మూతికున్న ముల్లబుట్టిని విప్పాడు. అది తోకాడిస్తూ గడ్డిపరకల్ని మేస్తూవుంది. దాన్నే చూస్తున్న రాములు కళ్ళలో కొత్త మెరుపు, మనస్సులో కొత్త ఆలోచనలు.

యింతకు ముందు బర్రె, దూడను ఎందుకు తన్నింది? దాన్ని పాలు ఎందుకు తాగనీయలేదు? దూడ మూతికి ముల్లగోరు వుంది. ముల్లగోరు ఎవరు కట్టారు? పటేలు.

దూడకు ముల్లగోరు! మా నెత్తిన అప్పుల బరువా!

తప్పించుకుపోయే కోడిపిల్లను గద్ద పొంచిచూసినట్టు రాములునే చూస్తున్న పటేలు "ఏంర జీతం వుండనన్నవట!"

కొట్టంలో నుండి బయటకొస్తున్న రాములు చప్పుడు చెయ్యలేదు.

"నిన్నే, సప్పుడు సెయ్యవ్! పోతేపో. సంచిల దుగ్గాని సల్ల గుంటె సవాలక్షమంది. కాని అప్పుంది సూసినావు! అది సెల్లగట్టి నీవు, నీ అయ్య యిద్దరూ పొండ్రి. అక్కడ అదే ఆ దుబాయిల ఆ మియ్యగాడు కూకోబెట్టి, కట్టలకు కట్టలే ఖజాన పంచి పెడతడు".

రాములు చప్పుడు చెయ్యలేదు. దోతికి అంటుకున్న గడ్డిపోసల్ని ఏరేసుకుంటూ నిలుచున్నాడు. పటేలుతో ఎన్నడు మాట్లాడలేదు రాములు. ఏమైన ఉంటే తన తండ్రికే చెపుతూవుంటాడు.

రాములుకు ఇరవై సంవత్సరాలు దాటినై. సన్నగ, నల్లగ వుంటాడు. పటేలు దోతి కట్టుకుంటే కొంచెం పైకి, తండ్రి దోతి కట్టుకుంటే కొంచెం క్రిందికి అతనికట్టు. తండ్రిలా తలపాగకట్టక పటేలు కొడుకులా క్రాప్ చేయించుకున్నాడు. ఈ మధ్యనే జేబులో ఓ పాత పెన్ను పెట్టుకున్నాడు. ఆ వూరి చదువు పంతులు యింట్లో ఎండుకట్టె షల్లల మోపును ఏస్తు, రాత్రిపూటల్లా అమ్మ—అవు, ఒకటి, రెండు. రెండింటిలో ఒకటి తీస్తే ఒకటి అంటున్నాడట!

అప్పుడే బజాన ఆనపకాయతో వచ్చిన పెంటయ్య దగ్గరనుండి దాన్ని తీసుకొని "అరె నీవు పోయి ఆ సాదాని పంతులును తీసుక రాపో ఎనకటి కాగితాలు అల్లకుతప్ప 'యింకొకరికి పల్కవు" అంటూ తాను యింట్లోకి, పెంటయ్య వీధిలోకి నడిచారు.

కొంత సేపయ్యాక పటేలు కాగితాలతోను, పెంటయ్య సాతాని పంతులుతోను తిరిగొచ్చారు.

"రండి పంతులు రండీ" అంటూ పిల్చి, పీటవేసి కూర్చోబెట్టి కాగితాలను ముందేశాడు.

"అంతా క్షేమమేగద, ఏమిటి సంగతి పత్రాలు మీ వాడికి అర్థం కావులెండి, వాళ్ళవి ఇంగ్లీసు చదువులుగదా"

"అందుకే మిమ్ములను పిల్సింది— కాస్త సూడండి పంతులు! వీళ్లు లెక్కకు తొందర పెడుతుండ్రు"

"సంద్రదెంటా! ఎందుకు అంత తొందర! లెక్కదగ్గర తొందర

పదొద్దు బిడ్డా!" అంటూ నశ్యాన్ని పీలుస్తూ, రాములు వైపు చూస్తు! "ఏంరా వీడు నీ కొడుకా!" ముక్కుతుడుచుకుంటూ అన్నాడు.

అవునన్నట్లు తలవూపాడు పెంటయ్య

పంతులు కాగితాల మడతను విప్పుతున్నాడు. మొదటి రంగు మారి, రాసినరంగు వెలిసి, కదిలిస్తే చిరిగేటట్టుందా కాగితం. అది పెంటయ్య తాత, పటేలు తాతగార్కి, తన తండ్రి పెండ్లికి అప్పు తీసుకున్నప్పుడు రాయించిన పత్రం. దాని వయస్సు పెంటయ్య కంటే ఐదేళ్ళెక్కువ. దాన్ని పటేలుకు, పెంటయ్యకు చూపిస్తూ–

"చూసింద్రా అప్పటి కాగితం, అప్పటి సిరా, అంటే అప్పుడు ఈ ఇంకు ఎక్కడిది. ఈ వూల్లల్లో కొన్ని బియ్యాన్ని నల్లగ మాడ్చి, పొడిచేసి, నీళ్ళలో కలిపి రాసేది" అంటూ పక్కకు పెట్టాడు.

మరో కాగితం దానికంటే తక్కువ వయస్సుది. అదీ రంగు మారిపోయింది.

యిది పెంటయ్య తండ్రి, పెంటయ్య పెండ్లప్పుడు పటేలు తండ్రి దగ్గర అప్పుతీసుకున్నప్పటి కాగితం. దానిమీద పెంటయ్య వేలి ముద్ర కూడ వుంది.

ఇక మూడవ కాగితం, యిది మాత్రం ఐదేళ్ళకిందటి దిదే! అది పెంటయ్య పెద్దబిడ్డ పెండ్లికి అప్పు తీసుకున్నప్పటిది. అన్ని టిని పూర్తిగ చదివి యినిపించాడు సాతాని పంతులు. ఆ కాగితాలు పెండ్లిలప్పుడు రాసిచ్చినవె అయినా, వాటి వెనకాల చావుకు, నోముకు, పుట్టకలకు, పురుల్లకు తీసుకున్న చిల్లర అప్పులుగూడ

రాసివున్నవి.

అన్ని విన్న పెంటయ్య "మొత్తం ఎంత బాకీటరు?" అతని శరీరంలో ఏదో కంపరం వొచ్చింది. గొంతులో మార్పు వొచ్చింది

"చెయ్యి పంతులు, మిత్తి, అసలు ఎంతో లెక్కచెయ్యండ్రి"

పంతులు కాగితాలను మరోసారిచూసి, ఓ కాగితాన్ని తీసి, "ఈ కాగితంలో అప్పు రూ॥ ఇరవై ఐదు హోలి, మిత్తి రెండు రుచ్చాలు నెలకు" అంటూ అరవై ఏండ్ల నుండి లెక్క కట్టాడు.

"యిది రెండవ కాగితం తీసుకున్న రూపాయలు ఏబై, వాటి మిత్తి పదింటికి పావలా చొప్పున", అంటూ ముప్పై ఏండ్ల నుండి లెక్కకట్టాడు.

"ఈ కాగితం 1977 లోనిది. అప్పు రెండొందలు. మిత్తి నూటికి నెలకు మూడు రూపాయలు", అంటూ మొత్తం లెక్కచేశాడు.

యిగ అన్నీ గుండు గుత్త సేసి సెప్పండ్రీ పంతులు" పటేలు

పంతులు ఒక్కసారి మళ్ళీ నశ్యం పీల్చాడు. పటేలు చుట్ట ముట్టించాడు. పంతులు అన్ని కలిపి కూడి, కనుబొమ్మలు ముడేసి, కాగితాన్ని చూసి, పటేలునుచూసి, పెంటయ్య వైపు మళ్ళి "రెండు వందలు తక్కువ, రెండువేల రూపాయలు రా" అంటూ కాగితాలను ఒకదానిపై ఒకటిపెట్టి వాటిపై పెన్నుంచాడు. పెంటయ్య నోరు తెరిచాడు. రాములు రెప్పవాల్చకుండ కాగితాల వైపు చూస్తున్నాడు. రాములు మదిలో రకరకాల భావాలు కదులుతున్నయ్! కాగితాలు ఇన్నేండ్లు ఎందుకున్నట్టు! ఈ యింటిమీద ఆనకురవలేదా? ఈ యిల్లు ఎప్పుడు కాలిపోలేదా? పట్టపెరిగినట్టు పెరిగిన ఈ అప్పును ఎంసక్క యిన్నాల్లు దాసిపెట్టింది. సరే చేసిన అప్పు తీర్చుతం.

మరి మేం చేసిన కష్టం ఎటుపోయినట్టు? పేట ఇచ్చే మడిగింపలను అప్పుకిందనే మల్లేసి ఎప్పుడు తీసుకోలేదని అయ్య సెప్పిందే! మరి బాకీ ఏం తగ్గలేదూ?

అయ్య పెండ్లప్పుడు అమ్మమ్మోల్లు యిచ్చిన ఆవుకట్టి, కోడెనుపెట్టి, పూటకు సర్వేడు పాలిస్తుంటే, "సీకు ఆవెందుకురా! మాకు అమ్మెయ్య" అని తీసుకున్నడట మరి! దాని బాపతు రూపాయలు ఎటు పోయినట్టు?

నేను యిత్తు పాలకు మేకను సాదితే, నా పాలకు ఒక మేక పోతు పిల్లొస్తే, ఆయాకు, ఈయాకు దానికి మేపి ఏడాదిన్నర సాదితే, దాన్నీ కోసుకునె. దాని పైసలు అప్పుల తగ్గించలేధా?

యిట్ల అన్నిటిని లెక్కకడితే యింకా అప్పు ఎక్కడుంటది? అనుకొంచి ఓ శ్వాస వదలి మళ్ళీ పీల్చి కాస్త ధైర్యం తెచ్చుకొని "పంతులుగారు? మేము తీసుకున్న అప్పునే లెక్క సేసింద్రు, మరి మేం తీర్చిన రకం గురించి ఏం చెప్పరు?"

"చూడుర కాగితంమీద వున్నది చదివి మీరు విన్నాక లెక్క చేసి చెప్పాను, నేను నా స్వతంగ చెప్పలేదుర" మరొకసారి నశ్యాన్ని పీల్చాడు.

"కాదు పంతులు! మేము మల్లేసుకున్న మడిగానం ఎటుపోయినట్టు? ఆవునమ్మినయి, మేకిపోతును అమ్మినయి, మా తాతచేసిన కష్టం, మయ్యచేసిన కష్టం, నేనుచేసిన కష్టం, యిప్పటికి మూడు తరాల రెక్కల కష్టం అంతా ఎటుపోయినట్టు? జెర సూడుండ్రి పంతులు! ఏమన్న హౌజాత్ పెట్టిందెమొ"

పంతులు మళ్ళీ కాగితాల వెనుక చూశాడు. కొంత ధాన్యం

యిచ్చినట్టు, వాళ్ళు మళ్ళీ తీసుకున్నట్టు రాసివుంది. అదేచెప్పాడు.

"గల్లమల్లేసినా ఏ షరుదుకో, ఏ పండక్కో, మళ్ళా తీసుకుంటనే వుండిరి. వొజాల్‌దాకా వచ్చినాదీ?" అవు మా దొడ్లెనే షేసే ఖూ కోదెకే శక్తె, దాన్ని అలాగ సాదితిర?

తన తండ్రి యిస్తారి చెప్పిన మాటలు గుర్తొచ్చినవి, పెంటయ్యకు ఈ పటేలు తండ్రి పెద్ద పటేలు, పెండ్లప్పుడు రెండు దున్నలు, ఒక బఱ్ఱె వున్న సంసారం. తనకు గుర్తుతెలిసే వరకే రెండుదొడ్ల పసులు అయి యిప్పుడు మూడుదొడ్ల పసులు, ఇరువై ఎకరాల తరి, ఏభై ఎకరాల చెలకాయె. తాను ముల్లుగర్ర పట్టినాకనె రెండు కొత్త బావులను తవ్వించి కరెంటు పెట్టించె. కరంటు రాక ముందు మోటకొట్టీ, కొట్టి నిద్ర అన్నమాట ఎరగమైతిమి.

తండ్రి, తల్లి, తాను, తన భార్యా పిల్లలు అందరూ రాత్రిం పగలు కష్టించి పనిచేసి గంతవున్న ఆస్తిని యింతసేస్తే, యీ నాటికి తన తండ్రి పెండ్లిబాకీ తీరదాయె! అల్లకు ఆస్తి పెరిగితే మాకు అప్పు పెరుగుద్దా? అని నాలుగుసార్లు అనుకున్నా, ఈ మాట ఒక్కసారే బయటికొచ్చింది. "అల్లకు ఆస్తి పెరిగితే మాకు అప్పు పెరుగుద్దా? నేను, రేపు నాకు పుట్టబోయే పిల్లలు, కష్టం చేసిన ఈ అప్పు పెరుగుతూనే వుంటది" అన్నాడు రాములు నేలనుచూస్తూ పటేలుకు, పంతులుకు, వినబడేటట్టే!

అదివిన్న పటేలుకు ఒక్కసారె ఎదరొమ్ముమీన చెయ్యేసి కదిపి నట్టనిపించింది.

"అయితే రెక్కల కష్టం వల్లనే మా ఆస్తి పెరిగిందంటరు"

మరి కాకపోతే అన్నట్టు చూశాడు రాములు.

వానికెరుక లేదులే పటేల, అన్నట్టు చూశాడు పెంటయ్య.

"సూస్తున్నవా పంతులు! యీల్ల తమాషా"

"ఏంరా పిల్లగ ఏదైనా పార్టీల జేరినావుర?"

"పూటకు లేనోల్లకు మాకు పార్టీలెందుకు పంతులు" పెంటయ్య

"పార్టీ లేదు_ గిర్టీ లేదు. వీని బిడ్డ మొగుడు దుబాయ్‌కి పోయిండు. యింతో అంతో సంపాయించుకొచ్చిండు, గోసిపోయి పైంటొచ్చింది. సేతికి గడియారం, సంకల రేడియో, అన్ని సూసి ఈడు గోసి సదురుకుంటుండు. దుబ్బను సరిగ దున్ననాయన దుబాయ్‌కి పోతాడట!"

"పోతే పోయె! మనమేమన్న సాదిపెట్టినమా? బాకీ కట్టిపోతే సరి"_ పంతులు.

"ఆదేంమాట పంతులు! మనం సాదందే బతికింర్రా! పంటైనా, పాడి అయినా వాళ్ళు తినంకనే గదా మసిల్లు చేరేది!"

"మరింకేంది! బాకీ తీర్చిపో కాని అక్కడ మన దేశంలో లాగ కాదురా! యిక్కడ యిష్టమున్నది మాట్లాడొచ్చు. యిష్టమున్న చోటికి వెళ్ళి బ్రతకొచ్చు యిష్టమున్న మతం పట్టొచ్చు అక్కడ అంతా తుర్కోల్లేనట" పంతులు.

"ఏ మతమైతే మాకేంది? కష్టం సేస్తేనే కదా కడుపు నిండేది?"

"అంటే యిక్కడ ఆకలితో చస్తున్నార్ర!"

"నోటితో సెప్పాలన పంతులు" రాములు.

"సూసింర్రా పంతులు! యిగ మీరే సెప్పుంర్రి న్యాయం!"

"సెప్పేది ఏంది ఆకలటుంచి పెరిగిన అప్పుకనిపిస్త లేదా?"

కొంతసేపు అందరి మధ్య నిశ్శబ్దం.

ఇంట్లోకి తొంగిచూసి "అరె సీన్‌రెడ్డి దొడ్డికాడికి పోయి మన ముసలి పయ్యెద్దును చెలకకు కొట్టుక పోక, నడవదని వదిలిపెట్టి పోయింట్రట. జెరన్ని సీళ్ళ తాపి, యిన్ని గడ్డిపోసలేసి రాపో" జీతగాళ్ళకు చెప్పలేక తన కొడుకుతో అన్నాడు.

"దాన్నమ్మక యింకెన్నాల్లు వుంచుతరె" అంటూ చేతిలో పుస్తకంతో వచ్చి, పుస్తకాన్ని మంచంమీద పడేసి దొడ్డివైపు నడిచాడు.

"రామ రామ! నీకేమెరకరా నాయనా! అది ఎంత కష్టం చేసింది!" అంటూ పంతులువైపు మళ్ళి, "ఆ ఎద్దును ఏడేండ్ల కింద తొమ్మిదొందలకు కొన్న. పొలాలన్ని దున్నడమే కాకుండా బడింలాగింది. బంతి తొక్కింది. దానికష్టం వల్ల ఎంతో కలొచ్చిందంటే నమ్ము? అందుకే సచ్చిందాక సాది అప్పెంక బొందపెడతాం, దాన్ని మాత్రం కోతకమ్మను".

"అంతేమరి" పంతులు.

పటేలు మాటలు రాములు తలలోని ఆలోచనలకు కొత్త రూపమిచ్చినవి, పెంటయ్యగూడ ఆలోచనలో పడ్డాడు.

"అయ్య చెపితే యినవు. మన బతుకులు గొడ్డుకన్నా అద్వాన్నం అన్న సంగతి తెల్సుకున్నవా! తొమ్మిదొందలు పెట్టి ఏడేండ్ల కింద కొన్న ఎద్దు ఎంతో కష్టం సేసింది. పంతులువైపు మళ్ళి పంతులుగారు! మీరు గూడ నాయం సెప్పండి! ఎద్దు కష్టం వల్ల ఎంతో కలిసొచ్చింది! కాబట్టి దాన్ని సచ్చేవరకు సాదాలి. మూడుతరాల నుండి మనుషులు కష్టం సేస్తానే వుంటేనేమో అసామికి కలిసిరాలేదు. మాకు అప్పు పెరుగుతూనేవుంది. రే పొద్దు

సచ్చిన్నాడు గూడ మల్లి! అప్పెసెయ్యాలే. అంటే ఎద్దుకంటే ఈనమైన బతకన్నమాట మాది"

పంతులు ఆలోచనలో పడ్డారు.

పెంటయ్య చీకటి బ్రతుకులో ఈ రోజు ప్రొద్దుపొడిచి నట్లయింది. అంతేకాదు తన కొడుకు రాములే ఓ సూర్యుడిలా కనిపించాడు తన కళ్ళకు! ఒక్కసారే శక్తినంతా కూడదీసుకుని–

"మా లెక్క సరిగ తేలిందా సరేసరి"–

"అప్పటి వరకూ పనిలోకి రానేరాం!" అంటూ రాములు, పెంటయ్య అక్కడి నుండి వెళ్ళిపోయారు.

భూకంపమొచ్చి తన యిల్లు, తన భూములు, తన పశువులు అన్నీ అందులో కొట్టుకపోయినట్టు అనిపించిన పటేలుకు, నోట మాట రాక వాళ్ళు పోయినవైపే చూస్తూ బొమ్మలా నిలుచున్నాడు.